


# ఆశించింది ఆచరణలో...

—రావిపల్లి నారాయణరావు

ఎర్రబడిన బుగ్గల్ని బొద్దుగా ఉన్న ముద్దు చేతులతో తడుముకుంటూ, వెక్కి వెక్కి ఏడుస్తూ గదిలో ఒక మూల కూర్చుని ఉన్న గోపీ ముఖం లోకి చూడలేక ఆఫీస్ బాగ్ పట్టుకుని బయటికి నడిచాడు చెన్నకేశ్వర్.

టేబుల్ మీద ఉన్న టెలిఫోన్ గణగణ శబ్దం, పక్కనున్న టైపు మిషన్ టకటక చప్పుడు భరించలేక పోయాడు చెన్నకేశ్వర్. తలపోటు బయలుదేరింది. మనస్సు స్తిమితంగా లేనప్పుడు కోకిల గానంకూడా కర్ణకఠోరంగా ఉంటుంది కాబోలు!

గోపీ స్కూలుకు వెళ్ళాడో, లేదో? ఇంకా ఏడుస్తూనే కూర్చుని ఉన్నాడో? దెబ్బలకు బెదిరిపోయాడు—వెధవ!

'చక్కగా నవ్వుతూ ఉండే గుండ్రని ముఖం, బూరెల్లా ఉబ్బే బుగ్గలు, నల్లగా మెలికలు తిరిగే జుత్తు—చూచేవాళ్ళకు ఇట్టే ముద్దొస్తాడు గోపీ. వాణ్ణి కొట్టడానికి నీకు చేతు లెలా వచ్చాయి? తప్పు చేస్తే మాత్రం అంతగా హడల కొడతారా? నువ్వు కన్నతండ్రివా? కసాయివాడివా?' ఉదయం ఎవరైనా గోపీని చూసి ఉంటే చెన్నకేశ్వర్ని దుమ్మెత్తి పోసేవారు.

చెన్నకేశ్వర్ సంగతి అందరికీ తెలుసు. అతను ఎంత కచ్చితంగా ఉంటాడో కూడా తెలుసు. అతని ఆదర్శం, ఆశయం మంచివే. కాని, కాస్త పట్టు, విడుపు లేకపోతే మనిషి జీవించలేడని వాదించే వారి అభిప్రాయంతో అతను ఏకీభవించడు. నెల ఆఖరు రోజుల్లో ఇంట్లో సరిపడ్డ దినుసులు లేకపోయినా, రోజుకు ఒక్క పూట భోజనం చేసి నెల ఆఖరు వరకు గడుపుతా నంటాడు కాని, ఎక్కడా అప్పు చేయడు. ఆఫీసులో అనవసరంగా కాలయాపన చేయడు.

అవసరం ఉంటేనే కాని ఎవరితోను మాట్లాడడు. తన పని తను చేసుకు పోతాడు. అత్యవసర పరిస్థితులలోనైనా ఇతరుల పని చేయనంటాడు. ఒక రోజు ఆఫీసరు తన ఛాంబర్స్‌లో ఏదో ఒక ఫైలు విషయం చర్చించి, ఆ తరవాత తన టేబుల్‌పై నున్న రెండు రిజిస్టర్లు—పది కిలోల బరువు ఉన్నవి—సెక్షన్‌లోకి తీసుకు వెళ్ళమని చెన్నకేశ్వర్‌ను కోరగా, 'ఆ పని మీ బంట్రోతుది. నాది కాదు' అని మరేమీ వినిపించుకోకుండా బయటికి నడిచిన వ్యక్తి అతను. అంత కచ్చితమైన మనిషి లోకంలో మరెక్కడా కనపడడంటే అతిశయోక్తి కాదేమో?

అతను పనిచేసే సీట్లో మరో మనిషి కూర్చుని ఉంటే ఈ సరికి హైదరాబాద్‌లో ఒక పెద్ద మేడ లేపి ఉండును. కాని, చెన్నకేశ్వర్ చేతి వాచీ కూడా కొనుక్కోలేక పోయాడింతవరకు. అక్రమ పద్ధతులు అవలంబించి పార్టీలకు లాభం చేకూర్చి, వారినుండి మామూళ్ళు వసూలు చేయడం వంటి పనులకు అతనెల్లప్పుడూ దూరంగా ఉంటాడు. అందరిదీ ఒక దారి అయితే అతనిది మరొక దారి. అతని పద్ధతి ఎవరికీ నచ్చదు. అందుకేనేమో అతను ఆ రోజు ఆఫీసులో అడుగు పెట్టినప్పటి నుండి మనసులో బాధపడుతున్న విషయం గ్రహించినా, ఎవరూ ధైర్యం చేసి అతని ముందుకు వెళ్ళి ఆ సంగతి ప్రస్తావించలేదు. పక్క సీట్లో కూర్చున్న అతని అసిస్టెంటుమాత్రం కొంతసేపు తటపటాయించి, ఆ తరవాత ఉండబట్టలేక అడిగాడు—"ఏమిటి, మాస్టారూ, మీ రీ వేళ అదోలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా?" అని.

"నో, నో! నథింగ్ ఆఫ్ దట్సార్ట్. ఐయామ్ ఓ కే!" అని చెన్నకేశ్వర్ ఫైల్లో ముఖం దూర్చాడు. అసిస్టెంట్ మళ్ళీ ఏమీ ప్రశ్నించలేదు.

"అయ్యా, పెద్ద గుమాస్తాగారూ! దొరగారి పిలవవుతూంది. ఏ టియ్యాల అదోనా గున్నారు? ఒళ్ళు బాగానేదా?" బంట్రోతు అప్పలస్వామి ప్రశ్నిస్తున్నాడు.

ఏమిటీ రోజు అంతా ఇలా అడుగుతున్నారు? తన పరిస్థితి అందరికీ తెలిసిపోతున్నట్టుంది. జరిగినది మరిచిపోయి ప్రవర్తించలేకపోతున్నాడు? మానసికమైన వ్యథ అంటే ఇదేనేమో!

పెన్ను, నోట్‌బుక్ పుచ్చుకుని ఆఫీసరు గదికి అడుగు పెట్టాడు చెన్నకేశ్వర్.

"వాటీజు దిస్, చెన్నకేశ్వర్?" వింతగా అతని ముఖంలోకి చూశాడు ఆఫీసర్, టేబుల్ మీద ఉన్న ఫైలు చూపిస్తూ.

ఫైల్‌లోకి చూశాడు. ఫైలులో నోటు వ్రాసి లేదు. నోటు వ్రాయకుండా ఫైలు ఆఫీసరుకు పంపడం పొరపాటే!

మౌనంగా నిలబడ్డాడు.

"ఎప్పుడూ లేనిది మీ రీవేళ ఇలా చేశారేమిటి? ఆర్ యు నాట్ ఫీలింగ్ వెల్?" అడిగాడు ఆఫీసర్.

"ఎస్, సర్! ఒంట్లో బాగాలేదు." చెప్పాడతను.

"దట్సాల్ రైట్. ఫైలు జాగ్రత్తగా చూసి పంపిస్తూండండి." ఆఫీసర్ మెల్లగా అన్నాడు. చీవాట్లు పెట్టలేదు. చెన్నకేశ్వర్ సాధారణంగా పొరపాటు చేయడన్న సంగతి అతనికి తెలుసు. ఆ పని మరొక గుమాస్తా చేసి ఉంటే ఆ ఉదయం గోపీకి చెన్నకేశ్వర్ పాఠం చెప్పినట్టు ఆఫీసర్ చెప్పి ఉండేవాడు.

ఆ తరవాత చెన్నకేశ్వర్ తన సీట్లో కూర్చున్నాడు. కాని, ఏ పనీ చేయలేకపోయాడు. అయిదు కొట్టే వరకు కాలం గడిపేసరికి తల ప్రాణం తోకకు వచ్చినట్టయింది.

గోడ గడియారం అయిదు కొట్టగానే బాగ్ పుచ్చుకుని ఆఫీసునుండి బయలుదేరాడు. లోకల్ ట్రెయిన్‌లో ఇంటికి వెళ్ళాలి తను. తిన్నగా కాచీగూడా స్టేషన్ వైపు నడిచాడు. ఇరవై నిమిషాల్లో స్టేషన్ చేరుకున్నాడు. 'లోకల్ ముప్ఫయి నిమిషాలు ఆలస్యంగా వచ్చును' అన్న ప్రకటన నోటీసుబోర్డు మీద లోకలటి పోటు అయింది. ఎంత త్వరగా ఇంటికి చేరుకోవాలనుకుంటున్నాడో అంత ఆలస్యమవుతూంది. అప్పటికే సూర్యుడు విశ్రాంతి తీసుకోవటానికని పడమటి దిక్కులో అదృశ్యమైపోయాడు. భాగ్యనగరం విద్యుద్దీపాల కాంతులతో కళకళలాడుతూంది. ప్లాట్‌ఫారంమీద ఆ చివరినుండి ఈ చివరికి రెండు రౌండ్లు కొట్టడంతో ఇరవై నిమిషాలు గడిచిపోయాయి. అప్పుడే బోను నుండి బయటపడ్డ సింహంలా గర్జించుకుంటూ ఒక్క దూకున స్టేషన్ లోకి వచ్చి ఆగింది మేడ్‌చెల్ లోకల్. చెన్నకేశ్వర్ బండి ఎక్కి కార్నర్ సీట్లో కూర్చున్నాడు. జరిగిన ఆలస్యాన్ని తగ్గించుకోవాలని కాబోలు వెంటనే వేగాన్ని పుంజుకుని కాచీగూడా నుండి బయలుదేరింది లోకల్. ట్రైను ఎంత వేగంగా పరుగెత్తినా మందంగా పోతున్నట్టుంది తనకు. మరో నలభై నిమిషాలకు దయానంద్ నగర్ స్టేషన్ చేరుకుంది లోకల్. చేతి సంచీ పుచ్చుకుని చెన్నకేశ్వర్ ఆ స్టేషన్‌లో దిగాడు. చివరి కంపార్టుమెంటు నుండి దిగాడేమో అతను ప్యాసెంజర్లందరి కంటె వెనకబడిపోయాడు.

ఆకాశం నిర్మలంగా ఉన్నా చిన్న జల్లుతో ప్రారంభమైంది వర్షం. వాతావరణం చల్లగా ఉంది. వర్షం ఎక్కువ అవుతుందేమోనన్న భయంతో బండి దిగగానే ఇళ్ళ వైపు పరుగెత్తారు ప్రయాణీకులు. కాని, చెన్నకేశ్వర్ పరుగెత్తలేదు. మొదట ఎంత త్వరగా ఇల్లు చేరాలనుకున్నాడో ఇప్పుడంత మెల్లగా నడుస్తున్నాడు.

ఇంటికి వెళ్ళగానే గోపీ తన దగ్గరికి వస్తాడా? తను సుశీలకు మొహం చూపించగలడా? 'మీరు అంత అమానుషంగా ప్రవర్తిస్తారనుకోలేదు సుమండీ!' అని ఆమె అంటే తన మనస్సు చివుక్కుమనదూ?

దయానంద్‌నగర్ స్టేషన్ కొత్తగా కట్టిన స్టేషన్. అక్కడ అన్ని రైళ్ళు ఆగవు. దాని అభివృద్ధి కార్యక్రమం ఈ మధ్యనే ప్రారంభమైనా, ప్లాటుఫారం మీద నిలబడ్డ ప్రయాణీకు లందరికి తలదాచుకునే వసతి లేదు.

మేడ్‌చెల్ లోకల్ వెళ్ళి కొన్ని క్షణాలు గడిచాయి. ప్లాట్‌ఫారం మీద చెన్నకేశ్వర్ ఒక్కడే మిగిలాడు.

ప్లాటుఫారం మీద లైట్లు మందంగా వెలుగుతున్నాయి.

వర్షపు జల్లు తగ్గలేదు.

స్టేషనుకు రెండు వైపులా రెండు ఫర్లాంగుల దూరంలో ఇళ్ళు కనుపిస్తున్నాయి.

ప్లాట్‌ఫారం దాటి కిందికి దిగి నాలుగడుగులు వేసిన చెన్నకేశ్వర్‌కు రోడ్డు పక్కనున్న ఒక పెద్ద బండరాయి సమీపాన మెరుస్తూ ఒక కాగితం కొట్టవచ్చినట్టు కనపడింది.

ఎవరో కాగితం పారేసుకున్నారు కాబోలు! పెద్ద వర్షం వస్తే బాగా తడిసి ముద్దయిపోతుందేమో? పోగొట్టుకున్న వాళ్ళు వెనక్కు వచ్చి వెదికితే వారికి దొరుకుతుందా? అవసరమైన కాగితం కావచ్చు.

చెన్నకేశ్వర్ క్రిందికి వంగి దాన్ని అందుకున్నాడు. అది కాగితం కాదు. వంద రూపాయల నోటు! ఒక క్షణం చలనం లేకుండా అలాగే నిలబడి పోయాడు అతను.

వంద రూపాయల నోటు— ఎవరు పారేసుకున్నారు? ఎవర్ని అడగాలి? ఎవరికి ఇవ్వాలి? పోగొట్టుకున్నవాడు మళ్ళీ ఇక్కడికి వస్తాడన్న నమ్మకమేమిటి? విశాలమైన ఈ భాగ్యనగరంలో ఆ వ్యక్తి ఎక్కడ ఉంటాడో? అసలిక్కడికి ఎందుకు వచ్చాడో? పోగొట్టుకున్న వ్యక్తిది ఈ వూరే అన్న నమ్మకమేమిటి? ఏ వ్యాపారిదో కావచ్చు. లేకపోతే ఎవరో కాంట్రాక్టరుదయి ఉండవచ్చు. గుమాస్తాది ఎందుకు కాకూడదు? గుమాస్తాలు పారేసుకోవటానికి వంద రూపాయలు ఎక్కడ నుండి వస్తాయి?!

మీ రెంతగానో మెచ్చుకునే క్వాలిటీ ప్రచురణలు

ఆంధ్రుల అభిమాన రచయిత్రు(త)ల రచనలు

**మారిన మనసులు- శ్రీమతి కావిలిపాటి**

**విజయలక్ష్మి రు. 11-00**

**సమిధ-శ్రీమతి ఇచ్ఛాపురపు కుసుమకుమారి రు. 10-00**

**అనతోమా - డి. వి. ఎస్. ఆర్. మూర్తి రు. 12-50**

**వెలుగుబాట ,, రు. 7-50**

(పై నాలుగు ఏ పత్రికలోనూ సీరియల్ కాకుండా డైరెక్టుగా విడుదలైనవి)

**కాంచనగంగ - శ్రీమతి సుధా గౌతమ్ రు. 8-00**

**జీవితగమ్యం - శ్రీమతి యర్రగుంట్ల**

**వరలక్ష్మీదేవి రు. 8-00**

(పై రెండు ఆంధ్ర పత్రికలో సీరియలై వేలాది పాఠకుల ప్రశంసలు పొందినవి)

మీకు కావలసిన పుస్తకాల ధరలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపండి. ఆ రూపాయికి వి. పి. పెట్టి పంపుతాము.

మీకు మొత్తం 6 పుస్తకాలు కావలసిన 50 రూపాయలు M.O. పంపండి. పోస్టేజీకి మాత్రమే వి. పి. పంపుతాము.

**క్వాలిటీ పబ్లిషర్స్,** రామమందిరం వీధి, విజయవాడ-2.

ఈ నోటు మీదేనాండీ — అని ఎవరినైనా అడిగితే — కాదని ఎవరంటారు? డబ్బు ఎవరికీ చేదు కాదు.

'నోటు తన కంట పడింది. ఎవరికో ఎందు కివ్వాలి? దానితో గోపీ వెధవకు రైలో, కారో కొని ఇవ్వాలి.' అతను నోటును మడిచి జేబులో పెట్టాడు. ఆ నోటు జేబులో పెట్టుకున్న తర వాత అతను త్వరగా నడవలేకపోయాడు. అడుగులు ముందుకు పడటం లేదు. శరీరం నిండా గొంగళి పురుగులు పాకుతున్నట్టు అనిపించింది. ఎవరూ తనను చూడ్డం లేదు కదా! ఎవరైనా తనను వెంబ డిస్తున్నారేమో? ఇది దొంగ సొమ్మేమో? పోలీసుల్ని చూసి ఆ దొంగ వెధవ నోటును ఇక్కడ పడేసి పోయి ఉంటాడు. దొంగతనం చేయడమే కాదు, దొంగ వస్తువుల్ని అధీనంలో ఉంచుకోవడం కూడా నేరమే!

చెన్నకేశ్వర్ వెనక్కు తిరిగి చూశాడు.

ఎవరో ఒక వ్యక్తి ప్లాటుఫారం వైపు పరుగెత్తుకు రావడం కంట పడింది. ఖాకీ దుస్తులు వేసుకుని ఉన్నా డా వ్యక్తి.

పోలీసువాడేమో?

ఎందుకు తీశా డా నోటు? ఈ రోజు లేవగానే తను ఎవరి మొహం చూశాడో? సందేహం లేదు. అతను పోలీసువాడే. జేబులో నోటు పెట్టడం చూశాడేమో — పరుగెత్తుకొస్తున్నాడు. తనకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు.

నోటు క్రింద పడేస్తే — ఆ వ్యక్తి దృష్టి తనమీదే ఉంది. రోటిలో తల దూర్చి రోకటి పోటుకు భయపడ్డం దేనికి?

"సార్!' అతను పిలిచాడు.

అసహనంగా చూశాడు చెన్నకేశ్వర్.

"సికిందరాబాద్ వెళ్ళే లోకల్ ఎన్ని గంటలకు వస్తుందండీ?' అతని ప్రశ్న.

గట్టిగా శ్వాస తీసి అతని వైపు చూశాడు చెన్నకేశ్వర్. పోలీసువాడు కాదు; ఖాకీ దుస్తుల్లో ఉన్న లారీ క్లీనర్‌లా కనుపిస్తున్నాడు.

"ఇంకో అర గంటకు కాని లోకల్ రాదు." చెప్పాడు చెన్నకేశ్వర్.

"అంతవరకు వర్షంలో పడిగాపులు కాయవల సిందే?" గొణుక్కుంటూ ప్లాట్‌ఫారంవైపు నడి చాడు ఆ వ్యక్తి.

చెన్నకేశ్వర్ ఇంటి వైపు దారి తీశాడు. రెండు నిమిషాలు నడిస్తే తను ఇల్లు చేరుకోవచ్చు. ఇంటికి, స్టేషనుకు చాలా దగ్గర. అగ్గిపెట్టె కొనాలన్నా,సబ్బు బిళ్ళ కొనాలన్నా స్టేషనుకు ఆవల వైపు ఉన్న అంగడికి పోయి తెచ్చుకోవచ్చు.

నడుస్తున్నాడన్న మాటే కాని, తనను ఎవరూ వెంబడించడం లేదు కదా అన్న అనుమానం మనసులో పీకుతూనే ఉంది.

ఆ దారిలోనే దొరికిన ఒక రూపాయి తీసుకువస్తే ఉదయం గోపీ ఒళ్ళు హూనం చేశాడు తను. ఇప్పుడు వంద రూపాయల నోటు దొరికితే చడీ చప్పుడూ కాకుండా జేబులో వేసుకున్నాడు. ఇదేం న్యాయం? ఎవరో ఇంగ్లీషు దొర చెప్పినట్లుంది—"షెల్ మి ది మాన్, ఐ విల్ షెల్ యు ది రూల్"— అని.

దొరగా బ్రతికినన్నాళ్ళూ ఏ తప్పు చేసినా వేలెత్తి చూపని లోకం, పరిస్థితుల ప్రభావం వల్ల క్రిందికి దిగజారినప్పుడు ఆ మనిషి చేసిన చిన్న దోషం కూడా పెద్ద నేరంగా గొంతెత్తి చాటుతుంది.

దొరికిన వంద రూపాయిల నోటు అక్కడే విసిరి పారేయడానికి అతడి మనసు అంగీకరించలేదు. అది జేబులో ఉండటం కూడా శ్రేయస్కరం కాదను కున్నాడు. వెనక్కు తిరిగి ప్లాట్‌ఫారం దాటి అవతల వైపు ఉన్న అంగడిలో వందరూపాయల నోటుకు చిల్లర తీసుకున్నాడు చెన్నకేశ్వర్.


తను ఇల్లు చేరగానే గోపి పరుగెత్తుకు రాలేదు.

వాడింకా ఏడుస్తూనే ఉన్నాడా? లేక అలిగి తన దగ్గరికి రాలేదా? సుశీల ఎటు వెళ్ళింది? ఆఫీసునుండి రాగానే ఎదురుగా వచ్చి చిరునవ్వుతో స్వాగతం పలికే సుశీల కనపడడం లేదు. తలుపులు తెరిచి ఉన్నాయి. లైట్లు వెలుగుతూ ఉన్నాయి. కాని, ఎవరూ కనపడడం లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వరాండాలో జోళ్ళు విడిచి గదిలో అడుగుపెట్టాడు చెన్నకేశ్వర్.

గదిలో మంచం మీద కూర్చుని ఉన్న సుశీల మొహం నిర్జీవంగా ఉంది. తనను చూడగానే కళ్ళలో పేరుకుని ఉన్న అశ్రుబిందువులను తుడుచు కుని, లేని నవ్వును పెదాల మధ్యకు తెచ్చుకుని అతని వైపు తిరిగింది.

సుశీల ఎందుకు అలా ఉంది? పది గంటల క్రిందట జరిగిన సంఘటన ఇంకా మరిచిపోలేదా? గోపీ ఎక్కడ? ఏడుస్తూ అలాగే కూర్చున్నాడా? అందుకేనేమో ఆమె అలా కుమిలిపోతూంది.

సుశీల అతని దగ్గరకు వెళ్ళి, చేతిలోని బాగ్ అందుకుంది.



"గోపీ ఏడీ! కోపాన్ని ఆపుకోలేక వెధవను బాగా కొట్టేశాను. అన్నం తిన్నాడా? స్కూలుకు వెళ్ళాడా? నా రాకను గమనించి పరుగెత్తుకు వచ్చే గోపి ఇప్పుడు రాలేదేమిటి?" ప్రశ్నల వర్షం కురిపించాడు చెన్నకేశ్వర్. సుశీల కళ్ళ నుండి బొట బొటా రాలిన కన్నీళ్ళు చూశాక దుఃఖాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు.

ఆమె కళ్ళలో పేరుకున్న నీటిని తుడుచుకుని చెప్పింది.

"మీరు వెళ్ళగానే గోపినీ దగ్గరికి తీసుకుని బుజ్జగించాను. భోజనం చేసి స్కూలుకు వెళ్ళాడు. స్కూలు విడిచి పెట్టగానే ఇంటికి వచ్చాడు. అప్పుడే నేను గమనించాను—డబ్బాలో కాఫీ పొడి నిండుకుందని. ఆఫీసు నుండి రాగానే కాఫీ ఇవ్వకపోతే మీరు చిరాకు పడతారని అంగడికి వెళ్ళి కాఫీపొడి తీసుకు రమ్మని చెప్పాను. పెట్టె అంతా గాలించినా చిల్లర నోట్లు దొరక లేదు. మొన్న మా అన్నయ్య వచ్చినప్పుడు దీపావళికి చీ; కొనుక్కోమని ఇచ్చిన వంద రూపాయల నోటు గోపి చేతిలో పెట్టి పంపాను. ఆ నోటు పట్టుకు వెళ్ళిన గోపి తిరిగి వట్టి చేతులతో వచ్చాడు. చేతిలో కాఫీపొడి లేదు. వంద రూపాయల నోటు లేదు. ఏమైందిరా అంటే మాటాడడు. ఆ లెంప, ఈ లెంప వాయించే సరికి చెప్పాడు— అంగడికి వెళుతూంటే చేతిలోని నోటు ఎక్కడో జారి పడిందని. ప్లాట్‌ఫారం దాటకముందే చూసుకున్నాడట. అప్పటికే చేతిలో నోటు కనపడలేదట. వాడీ సంగతి చెప్పగానే నేను స్టేషన్ వైపు పరుగెత్తాను. ప్లాట్‌ఫారం ముందు ఉన్న ఆరు బయలు స్థలంలో అంతటా వెతికాను. ఎక్కడా కనపడ లేదు . . ." సుశీల చెప్పుకుపోతూంది. ఆ తరవాత చెప్పిన మాటలు అతని చెవిని పడలేదు. కాని, స్టోర్ రూమ్ ప్రక్కన కూర్చుని ఏడుస్తున్న గోపి గొంతు అతని చెవిని పడింది. అది విని అతను గబగబా లోపలికి పరుగెత్తాడు.

"వద్దండీ! ఆ తప్పు వాడిది కాదు, నాది. చిన్నవాడి చేతికి వంద రూపాయలు నోటు ఇవ్వడం నా బుద్ధి తక్కువ. వాడిని కొట్టకండి. ఉదయం మీ చేత, గంట క్రిందట నా చేత దెబ్బలు తిని సొమ్మసిల్లి పోయాడు. మళ్ళీ మీరు కొట్టారంటే వాడు బ్రతకడండీ. పోతే పోయాయి వంద రూపాయలు— నా బాబుని కొట్టకండీ . . . కొడితే నా మీద ఒట్టే!"


అతని వెంట పరుగెత్తుకు వెళ్ళింది సుశీల.

అతను వెళ్ళి గోపిని రెండు చేతులతోను ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు. రెండు బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాడు.

"నాన్నా! నేను ఎప్పుడూ దొరికిన డబ్బు తీసుకోను, జాగ్రత్తగా ఉంటాను. నన్ను కొట్టకు, నాన్నా, నా బుగ్గలు నొప్పి పెడుతున్నాయి." కన్నీళ్ళు తుడుచుకున్నాడు గోపి.

"లేదు, బాబూ! ఇంకెప్పుడూ కొట్టను." తల నిమురుతూ ముద్దు పెట్టాడు చెన్నకేశ్వర్.

సుశీల కళ్ళలో వెయ్యి జ్యోతుల వెలుగు చోటు చేసుకుంది. *



హైదరాబాదులోని బాలభారతి వార్షికోత్సవంలో జ్యోతి వెలిగించిన సాంస్కృతిక శాఖమంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, సెక్రటరీ శ్రీమతి సుశీలారాణి ప్రభృతులు.

# కిన్నెరలో 'హంసధ్వని'

**జంటనగరాల** ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఇటీవల రవీంద్ర భారతిలో తన నెల నెలా వినోద కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి నెలా ఒక వినోద కార్యక్రమాన్ని జరపటం ఈ సంస్థ ఉద్దేశం.

సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి ఈ కార్యక్రమాన్ని లాంఛన ప్రాయంగా ప్రారంభించారు. శ్రీ ఎల్. మాలకొండయ్య వ్రాసిన 'హంసధ్వని' లలిత గీతాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. 'హంసధ్వని' పుస్తకాన్ని ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. శ్రీమతి ఇంద్రామణి కూర్చిన సంగీతం కర్ణపేయంగా ఉంది. శ్రీ ఎల్. మాలకొండయ్యను అభినందిస్తూ శ్రీయుతులు ఎమ్. వి. నారాయణరావు, ఉమాపతి, వెంకట శివయ్యగారలు మాట్లాడారు.

సంస్థ కార్యదర్శి శ్రీ మద్దాళి రఘురాం తన నివేదిక సమర్పించారు.

అదేరోజు నీలిమా ఆర్ట్స్ అకాడెమీ, శ్రీకాకుళం వారు సమర్పించిన 'భారత నారి' రూపకాన్ని కూడా ప్రదర్శించారు. ★



బెంగుళూరులో 'వంశీ' శాఖ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న వంశీ రామరాజు. చిత్రంలో శ్రీమతి రోడామిస్త్రీ, శ్రీ కోదండరామయ్య, పి. బి. శ్రీనివాస్, బెంగుళూరు లత ప్రభృతులు.